క్లుప్తంగా

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఇంద్రవెల్లి: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఏఎస్సై లక్ష్మణ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు పట్టుదలతో చదవి లక్ష్యం వైపు అడుగులు వేయాలని సూచించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా.. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై కాత్లే భీంరావ్, ప్రిన్సిపాల్ ధన్‌రాజ్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'డీఈవోను విధుల నుంచి తప్పించాలి'

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా విద్య శాఖను అప్రతిష్ఠపాలు చేస్తున్న డీఈవోను విధుల నుంచి తప్పించాలని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, జలేందర్‌లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం పారదర్శకంగా చేపట్టాల్సిన సర్దుబాటు ప్రక్రియను ఇష్టారీతిన చేపట్టారని ఆరోపించారు. ఉపాధ్యాయులు బోధించే విషయాలతో సంబంధం లేకుండా, విద్యార్థుల సంఖ్యకు సంబంధం లేకుండా, ఒక్కో ఉపాధ్యాయుడికి మూడు పాఠశాలల్లో విధులు కేటాయించడం సరికాదన్నారు. పాఠశాలలపై ఎంఈవోల పర్యవేక్షణ కొరవడిందన్నారు. సర్దుబాటు విషయంలో డీఈవోను అడిగితే పొంతనలేని సమాధానాలు ఇస్తున్నారని తెలిపారు. వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

సరుకులు అందజేత

గుడిహత్నూర్: మండలంలోని డోంగర్‌గావ్ గ్రామంలో షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయి నిరాశ్రయులైన దోమకొండ సుధాకర్ కుటుంబానికి స్థానిక జైదేవీ మెడికల్ యజమాని మదన్ గిత్తే శనివారం వంట సామగ్రి, దుప్పట్లు అందజేశారు. మరింత సాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఆయన వెంట ఆర్‌ఎంపీలు సంజీవ్, బండారి రవీందర్, ముండే గణేష్ ఉన్నారు.

26న మండల, డివిజన్ కమిటీల ఎన్నిక



మాట్లాడుతున్న పుర్క బాపురావ్

ఇంద్రవెల్లి: తుడుందెబ్బ మండల, డివిజన్ కమిటీలను ఈనెల 26న ఎన్నుకోనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావ్ తెలిపారు. శనివారం మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుడుందెబ్బ మండల, డివిజన్ పాత కమిటీలను రద్దు చేశామన్నారు. ఉట్నూర్, బోథ్, ఆదిలాబాద్ డివిజన్‌ల 9 తెగల ఆదివాసీలు, యువకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు శంకర్, రామేశ్లి బోజన్న, గేడం భరత్, రఘునాథ్, తోడసం భగవంత్‌రావ్, ఆర్క రమణ పాల్గొన్నారు.

పరామర్శ

ఎదులాపురం: ఆదిలాబాద్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్‌ఎస్ సీనియర్ కార్యకర్త ఖయ్యుమ్‌ను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న శనివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్యం, వైద్య సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

ఓటరు జాబితాలో పొరపాట్లు సరిచేయాలి



మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ విష్ణు

తాంసి: ఓటరు జాబితాలో పొరపాట్లను సరిచేయాలని తాంసి డిప్యూటీ తహసీల్దార్ విష్ణు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన ఓటరుల నమోదుపై శిక్షణ ఇచ్చారు. జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలు సైతం పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నరేశ్, జూనియర్ అసిస్టెంట్ బాపురావు, రాఘవేంద్ర, సిబ్బంది ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముక్కోటి ఏకాదశి

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- ఉదయం నుంచే ప్రత్యేక పూజలు



జైనథ్: పూజలు చేస్తున్న భక్తులు

జైనథ్: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ముక్కోటి ఏకదశి వేడుకలను వైభవంగా నిర్వహించారు. శనివారం వేకువ జామున ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఉత్తర ద్వార దర్శనం చేసుకొని, ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను బంతిపూలతో అలంకరించిన పల్లకిలో ప్రతిష్ఠించి, పుర వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు.

కూర వేంకటేశ్వర ఆలయంలో..

మండలంలోని కూర గ్రామంలోని వేంకటేశ్వర ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్తర ద్వార దర్శనం చేసుకొని, స్వామి వారికి మొక్కుకున్నారు.

బోథ్: మండలంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. వేంకటేశ్వర ఆలయంలో ఉదయం స్వామి వారికి, అమ్మ వారికి పంచామృత అభిషేకం, అలంకరణ చేశారు. అనంతరం విష్ణుసహస్ర నామస్తోత్ర పారాయణం, ఉత్సవ మూర్తులతో పల్లకి సేవ నిర్వహించారు. ఉత్తర దర్శనం ద్వారా వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. కొత గ్రామం నుంచి శబరి మాతభక్తులు కాలినడకన వేంకటేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్నారు.

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి పూజలు నిర్వహించారు. వడ్డాడి లింబాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఉదయం నుంచే భక్తుల సందడి మొదలైంది. నిపాని వేంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు పిప్పల్‌కోటి ఆలయంలో సైతం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



ఆదిలాబాద్: పూజలు చేస్తున్న భక్తులు



తాంసి: వడ్డాడిలో..



బోథ్: పూజలు చేస్తున్న అర్చకుడు



బోథ్: కొరట నుంచి కాలినడకన వస్తున్న భక్తులు

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



రైతు విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌టౌన్: రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. రైతు దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని కిసాన్‌చౌక్‌లో రైతు విగ్రహానికి పూలమాలలు వేశారు. ఆయన మాట్లాడుతూ.. రైతుల బాధలను దూరం చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. అంతకు ముందు మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారం కోసం ముందుండి పోరాడుతామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు బండి దత్తాత్రి, గోవర్ధన్ యాదవ్, నారాయణ, లోకారి పోశెట్టి, విఠల్, సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, లంకా రాఘవులు, సుజాత, సంజీవ్ రెడ్డి, దారట్ల కిష్టు, గణపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గీతా జయంతి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

జైనథ్: మండలంలోని ఖాప్రి గ్రామంలోని శ్రీ కృష్ణాలయంలో గీతా జయంతిని ఘనంగా నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయంలో ప్రతిఏటా గీతాజయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఉదయం నుంచే భక్తులు హోమం, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గీతాపారాయణం గావించారు. కాగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు..

ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, స్థానిక నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత తమ గ్రామానికి మొదటిసారిగా రావడంతో గ్రామస్తులు సన్మానించారు.

కొలాం గిరిజన గ్రామాల అభివృద్ధిపై సర్వే



లిమ్‌గూడ గ్రామంలో వివరాలు సేకరిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జన్‌జాతి ఆదివాసీ న్యాయ మహాఅభియాన్ పథకంలో భాగంగా కొలాం గిరిజన ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి శనివారం మండల అధికారులు సర్వే నిర్వహించారు. లిమ్‌గూడ, బొడ్డిగూడ, పాటగూడ, కొలంగూడ, కేస్లాగూడ గ్రామాల్లో అధికారులు పర్యటించారు. గ్రామ పరిస్థితులు, అభివృద్ధి, సదుపాయాలు, సమస్యలు, జీవన విధానాన్ని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నివేదికను జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి పంపించడం జరుగుతుందని ఎంపీవో సంతోష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కోరెంగా గాంధారి, మెస్రం రేణుక, సోయం రాంభబాయి, రాథోడ్ సేవంతబాయి, ఈవో సంజీవ్‌రావ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



వంట గదిని పరిశీలిస్తున్న డాక్టర్ సర్ఫారాజ్

ఆదిలాబాద్‌రూరల్: వసతి గృహంలో వంటగదితో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సర్ఫారాజ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కొలాం ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. 384 మంది విద్యారులకు వైద్య పరీక్షలు చేయగా.. అందులో 134 మంది విద్యార్థులు చిన్నపాటి అనారోగ్యంతో బాధపడుతున్నారన్నారు. వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణ, హెల్త్ సూపర్ వైజర్స్ బొమ్మెత సుభాష్, ఆడే సురేశ్, హెల్త్ అసిస్టెంట్ పవర్ ప్రేమ్‌సింగ్, ఆశలు నర్మద, అనిత పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరేడిగొండ: చట్టాలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని జడ్జి బి.హుస్సేన్ అన్నారు. బోథ్ మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని వాగ్దారి గ్రామంలో చట్టాలపై అవగాహన కల్పించారు. గుడుంబా రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామస్తులందరూ సహకరించాలని పేర్కొన్నారు. విద్యా హక్కు, బాల్య వివాహాలు, మోటార్ వెహికిల్ యాక్ట్, సైబర్ నేరాలు, లోక్ ఆదాలత్ గురించి అవగాహన కల్పించారు. అనంతరం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. గ్రామస్తులు మద్యపానానికి దూరంగా ఉండాలని, చట్టాల గురించి కనీస పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రెటరి పంద్రం శంకర్, న్యాయవాది ఆడెపు హరీష్, కోర్టు సూపరింటెండెంట్ శేఖర్ రెడ్డి, సర్పంచ్ గంగాదేవి, నేరడిగొండ, బోథ్ ఎంపీపీలు రాథోడ్ సజన్, తుల శ్రీనివాస్, ఎక్సైజ్ సీఐ రాజమౌళి, గ్రామస్తులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



పాస్టర్లకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఉట్నూర్‌రూరల్: చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సెయింట్ పాల్స్ పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకు ముందు ఎమ్మెల్యేను పాఠశాల యజమాన్యం, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకొని తల్లి దండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. పాఠశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత స్థానంలో నిలిచారని గుర్తు చేశారు. అనంతరం క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఫాదర్ వినోద్, అలగ్జాండర్, ప్రిన్సిపాల్ డానా, సిబ్బంది డానియల్, భూమన్న, ఆశన్న, ప్రసాద్, సుదీర్, జైరాజ్, బక్కన్న, మేరీ మిస్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా రైతు దినోత్సవం



రైతులను సన్మానిస్తున్న బొర్రన్న



మాట్లాడుతున్న ఆవుల రాకేశ్

బోథ్: మండల వ్యాప్తంగా రైతు దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని కనుగుట్ట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడు చిలుక సతీష్ ఆధ్వర్యంలో రైతులను సత్కరించారు. ధన్నూర్(బి) గ్రామంలో రైతుస్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న ఆధ్వర్యంలో గ్రామంలోని ఐదుగురు ఉత్తమ రైతులను సన్మానించారు. సొనాలలోని వివేకానంద పాఠశాలలో రైతుల వేషాధారణలో చిన్నారులు కూరగాయలు అమ్మారు. నాగభూషణం పాఠశాలలో రైతు దినోత్సవాన్ని నిర్వహించారు.

ఆదిలాబాద్‌రూరల్: మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్ రైతుల సంక్షేమం కోసం అనేక పోరాటాలు చేశాడని కిసాన్ మిత్ర ఫీల్డ్ కోఆర్డినేటర్ ఆవుల రాకేశ్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని రాములుగూడలో కిసాన్ మిత్ర హెల్ప్‌లైన్ ఆధ్వర్యంలో రైతు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చరణ్ సింగ్ జయంతి సందర్భంగా రైతు దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుందన్నారు. తన పంటను కాపాడుకునేందుకు పగలు, రాత్రి కష్టపడుతున్న పంట చేతికి అందుతుందనే నమ్మకం లేదన్నారు. మూడు సంవత్సరాల నుంచి ప్రకృతి సహకరించక, మార్కెట్‌లో మద్దతు ధర లభించక రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రైతులు పాల్గొన్నారు.

జైనథ్: మండలంలోని మేడిగూడ గ్రామంలో శనివారం రైతు దినోత్సవం నిర్వహించారు. శ్రీ రాజరాజేశ్వర ఏజెన్సీ ప్రొప్రైటర్ క్యాతం శివ ప్రసాద్‌రెడ్డి గ్రామానికి చెందిన పలువురు రైతులను శాలువాలతో సత్కరించారు.

విద్యార్థినులు ధైర్యంగా ముందుకెళ్లాలి



అవగాహన కల్పిస్తున్న సభ్యులు

ఉట్నూర్‌రూరల్: విద్యార్థినులు ధైర్యంగా ముందుకెళ్లాలని, ఎవరైనా వేధిస్తే తమ దృష్టికి తీసుకురావాలని మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ యశోద, సఖీ సిబ్బంది సుకేశ్నలు అన్నారు. శనివారం మహిళా సాధికారత కేంద్రం, ఆదిలాబాద్ సఖీ కేంద్రం సంయుక్తంగా ఉట్నూర్ మండలంలోని శ్యాంపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో, మండల సమాఖ్య కార్యాలయంలో బేటీ బచావో - బేటీ పడావో, సఖీ సేవలు, బాల్య వివాహాలు, పోక్సో చట్టం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఏపీఎంలు, సీసీలు, వీవోఏలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'రైతు లేనిదే రాజ్యం లేదు'

జైనథ్: రైతు లేనిదే రాజ్యం లేదని ఏడీసీసీ డైరెక్టర్, జైనథ్ పీఏసీఎస్ చైర్మన్ బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండలంలోని సహకార సంఘంలో నిర్వహించిన రైతు దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు రైతులను ఘనంగా సన్మానించారు. ఆరుగాలం కష్టపడి పనిచేసే రైతుల సేవలు వెలకట్టలేనివని అన్నారు. సీఈవో గంగన్న, డైరెక్టర్ కరుణాకర్ రావ్, సిబ్బంది ప్రశాంత్, సత్యనారాయణ, గౌరీ, రైతులు నారాయణ, రాజలింగు, దాసు, అడెల్లు, గంగన్న పాల్గొన్నారు.

ప్రధానమంత్రి విశ్వకర్మయోజన సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న రాజుయాదవ్

ఇచ్చోడ: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోవాలని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోర్ల రాజుయాదవ్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని బ్రహ్మంగారి ఆలయంలో విశ్వకర్మలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రోజురోజుకూ చేతివృత్తుల వారికి ఆదరణ తగ్గుతున్నందున ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో చేతివృత్తుల వారికి ప్రత్యేకంగా సాయం అందించడానికి ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా విశ్వకర్మల్లో ఉన్న ఉప కులాలు లబ్ధిపొందాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కదంబాబారావు, మండల ప్రధానకార్యదర్శి రమేశ్, విశ్వకర్మ సంఘం నాయకులు పాల్గొన్నారు.

'విద్యార్థి మృతికి అధికారులే కారణం'



మాట్లాడుతున్న మాదవార్ హరీశ్‌రెడ్డి

బేల: బజార్‌హత్నూర్ మండలానికి చెందిన డిగ్రీ విద్యార్థి తొడసం రాహుల్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం కాకతీయ యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ మాదవార్ హరీశ్‌రెడ్డి ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో మాట్లాడారు. కాకతీయ యూనివర్సిటీ అధికారులు అనాలోచిత నిర్ణయంతో డిగ్రీ పరీక్ష కేంద్రాలను మార్చడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబానికి రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్‌చేశారు. ఏజెన్సీ ప్రాంత సమస్యలు, ఆర్టీసీ బస్సు సౌకర్యం సమస్యలను దృష్టిలో పెట్టుకుని కాకతీయ యూనివర్సిటీ అధికారులు ఎక్కడి డిగ్రీ విద్యార్థులకు అక్కడే పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఏబీవీపీ నాయకులు మనోజ్ రెడ్డి, నవనీత్, ప్రీతం, సాయి, సుమిత్, సురజ్, తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం







ఆదిలాబాద్: క్రిస్మస్ వేడుకలకు జిల్లాలోని చర్చిలను విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. చెట్లకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని హోలీ ఫ్యామిలీ క్యాథడ్రల్ చర్చి, ఇండియన్ మిషన్ చర్చి, బెయేర్షబా చర్చిలను అందంగా అలకరించారు. మార్కెట్‌లో క్రిస్మస్ ట్రీలు, బొమ్మలు, పూలు, బెల్స్(గంటలు), శాంతాక్లాజ్(క్రిస్మస్ తాత) బొమ్మలు, విద్యుత్ దీపాలు, బైబిల్ గ్రంథాల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

ఎమ్మెల్యేను సన్మానించిన ట్రాన్స్‌జెండర్లు



సన్మానిస్తున్న ట్రాన్స్‌జెండర్లు

ఉట్నూర్‌రూరల్: ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను స్థానిక ట్రాన్స్‌జెండర్లు జుబేదా, చంప, అలిజా, శ్రీదేవిలు శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. బొజ్జు పటేల్ తనయుడి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న వారు ఎమ్మెల్యేను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.